క్లుప్తంగా

గొట్టిపల్లిలో భూసర్వే ప్రారంభం



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని గొట్టిపల్లి రెవెన్యూ గ్రామంలో గల కంబకాయ కూడలి వద్ద డ్రోన్‌తో భూసర్వేను ఎంపీపీ ఆరంగి మురళి సోమవారం ప్రారంభించారు. ఈ రెవెన్యూ గ్రామంలో 1110 ఎకరాల భూమి ఉందని, 219 సర్వే నంబర్లు ఉన్నాయని వీఆర్వో ఎం.అప్పలనాయుడు తెలిపారు. సర్వే సక్రమంగా చేయాలని వీఆర్వో, సర్వే సిబ్బందికి ఎంపీపీ సూచించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, జమ్ము సర్పంచ్ వాన గోవిందరావు, అటవీ శాఖ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన చెత్త సేకరణ బుట్టలు



చెత్త సేకరణ బుట్టలను భద్రపరుస్తున్న సిబ్బంది

సారవకోట: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలు అందించనున్నారు. ఈ మేరకు సోమవారం మండలానికి చెత్త సేకరణ బుట్టలు చేరాయి. వీటిని మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచారు. ప్రతీ ఇంటికి రెండు చొప్పున ఈ బుట్టలు అందజేయనున్నట్లు ఈఓపీఆర్డీ రేణుక తెలిపారు. వీటిని సచివాలయాలకు సరఫరా చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి గౌరీ శంకర్ ఉన్నారు.

ఏజీపీగా గోవిందరావు



ఆమదాలవలస: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది సీపాన గోవిందరావును నియమించినట్లు సోమవారం ఆయన తెలిపారు. 2020లో కూడా గోవిందరావు ఏజీపీగా విధులు నిర్వహించారు. ఆయన పదవీకాలం ఈ సంవత్సరం ఫిబ్రవరితో ముగిసింది. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మరో మూడు సంవత్సరాలు పదవీకాలానికి ఏజీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుర్రపుడెక్క తొలగిస్తాం..



బడ్డవానిపేట వద్ద చానల్‌ను పరిశీలిస్తున్న ఏఈ సురేష్

నరసన్నపేట: మండలంలోని పోలాకి ఓపెన్ హెడ్ చానల్‌లో గుర్రపుడెక్క అధికంగా చేరిందని, దీనిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వంశధార ఏఈ సురేష్ తెలిపారు. ఇటీవల వర్షాలకు చుట్టు పక్కల కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క పోలాకి ఓపెన్ హెడ్ చానల్‌లో చేరింది. ఉర్లాం సమీపంలోని బడ్డవానిపేట వద్ద వందల టన్నుల గుర్రపుడెక్క పేరుకుపోయింది. కిందకు నీరు వెళ్లని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతుండగా.. ఏఈ సురేష్ సోమవారం పరిశీలించారు. పరిస్థితిని కలెక్టర్‌కు తెలియజేసి తొలగించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. స్థానిక సిబ్బంది పలువురు ఉన్నారు.

పెన్నా-వంశధార పర్యటన అర్థరహితం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు

కొత్తూరు: టీడీపీ నాయకులు చేపడుతున్న పెన్నా టూ వంశధార పర్యటన అర్థరహితమని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు అన్నారు. కొత్తూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వంశధార ప్రాజెక్టు పేరుతో నేడు మరోసారి జిల్లా ప్రజలకు మాయమాటలు చెప్పడానికి మాజీ సీఎం చంద్రబాబు వస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ముంపు గ్రామల ప్రజలను సంక్రాంతి అని కూడా చూడకుండా పోలీసులతో నెట్టేసిన విషయాన్ని ఇప్పటికీ నిర్వాసితులు మరిచిపోలేదన్నారు. గత టీడీపీ పాలనలో నిర్వాసితుల పేరుతో డబ్బులు దోచుకున్నవారిని నేడు చంద్రబాబు వెంటవేసుకుని జిల్లాకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ నాయకులకు రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంగువాసు, కొయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య స్వామి, అగతమూడి రంజిత్, టంకాల రమణరావు, చల్లా ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



సరుబుజ్జిలి: షళంత్రిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సరుబుజ్జిలి: ప్రతీ కుటుంబ సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టంచేశారు. మండలంలోని షళంత్రి, బురిడివలసకాలనీ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టబోయే పథకాల గురించి తెలియజేశారు. ప్రజలు చెప్పిన సమస్యలను అధికారులతో చర్చించి క్షేత్రస్థాయిలోనే పరిష్కరించారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. గత పాలకుల కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించారని, ప్రజల సంక్షేమం కోసం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే ప్రజలంతా సీఎం జగన్‌కు బాసటగానిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జివర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ బత్తిని వరలక్ష్మి, పున్నపురెడ్డి తవిటినాయుడు, అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ ఫలాలు

పాతపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రంలోని పాతపట్నం-2 గ్రామ సచివాలయం పరిధిలోని దుర్గమ్మకాలనీ, టీచర్స్ కాలనీ, గాంధీనగర్, సాయినగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందించిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు తెలియజేయాలన్నారు. సంక్షేమ పథకాల కోసం ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గణేష్ నగర్‌లో డ్రైనేజీని నిర్మించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునుడు, ఎం.తాతయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పనుకు మోహన్, వరదరాజులు, సుధాకర్, కర్రి లక్ష్మీనారాయణ, చిన్నారావు, శ్రీధర్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: దుర్గమ్మకాలనీలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వార్డులను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రానున్న ఎన్నికలు చాలా కీలకమని, నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మబగాంలో సోమవారం మేజరు పంచాయతీకి చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, ఇతర ప్రధాన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ వార్డులను, వీధులను దత్తత తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో నరసన్నపేటలో మంచి మెజార్టీ రావాలన్నారు. దీనికి అందరూ ఇప్పటి నుంచే కలిసి పనిచేయాలన్నారు. 20 వార్డుల్లో రోజుకొక వార్డు చొప్పున సమీక్ష చేయడం జరుగుతుందన్నారు. అలాగే మంగళవారం నుంచి నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలు గుర్తించాలని, వాటిని రానున్న 10 నెలల్లో వీలున్నంత వరకు పరిష్కరించుకుందామని తెలిపారు.

పట్టణ పార్టీ అధ్యక్షుడిగా పి.సాయి ప్రసాద్‌ను ఎమ్మెల్యే ఎంపిక చేశారు. ఈయన పేరును ప్రతిపాదించి పార్టీకి పంపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్ సాయి ప్రసాద్, పార్టీ నాయకులు చీపురు కృష్ణ, రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



నరసన్నపేట: ముంపు పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నరసన్నపేట: మండలంలోని జమ్ము పరిధిలోని ముంపు పొలాలను ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్తలు భాగ్యలక్ష్మి, ఉదయ్‌బాబులు సోమవారం పరిశీలించారు. రెడ్డి సతీష్ పొలంలో డ్రమ్ సీడర్‌తో వేసిన నాట్లు ముంపు బారిన పడటంతో వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు పొలాల్లో నీరు లేకుండా ఉంటే డీఏపీ, పొటాష్, యూరియా కలిపి వేయాలన్నారు. పొటాష్ విధిగా వాడాలని రైతులకు సూచించారు. దీంతో వెంటనే వరి బాగా ఏపుగా పెరుగుతుందని, ముంపు నుంచి తేరుకుంటుందన్నారు. స్థానిక ఏడీ రవీంద్రభారతి, ఏఓ కె.సునీత తదితరులున్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

ఎల్.ఎన్.పేట: ఇటీవల కురిసిన వర్షాలకు పల్లం ప్రాంతాల్లోని పంట పొలాల్లో నీరు చేరి పొలాలు ముంపు బారినపడ్డాయి. పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని దబ్బపాడు, ధనుకువాడ, చిట్టిమండలం, కోవిలాం ప్రాంతాల్లోని ముంపు బారిన పడిన పొలాలను సోమవారం పరిశీలించారు. పొలాల్లో నీరు వెళ్లిపోయేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపుబారిన పడిన పొలాల్లో కొద్దీ మొత్తంలో యూరియా, పొటాష్ వేయటం వల్ల ముంపుబారిన పడిన పొలంలోని పంట చేను త్వరగా కోలుకుంటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. మండలంలోని పాలవలస పంచాయతీ మర్రిపాడులో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు గట్టులపైన, రహదారికి ఇరువైపులా సోమవారం మొక్కలు నాటారు. మండలానికి ప్రస్తుతం 2400 మొక్కలు వచ్చాయన్నారు. మెట్టు ప్రాంత భూముల రైతులకు, చెరువు గట్లుపైన, కొన్ని గ్రామాల్లో రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ద్వారా జీడి, మామిడి, సపోటా మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గిరిజన గ్రామమైన మర్రిపాడులో 10 కొబ్బరి మొక్కలు నాటామన్నారు. ఓ.వి.పేటలో వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు ఆధ్వర్యంలో రాణమ్మ చెరువు గట్టుపైన మొక్కలు నాటారు. ఓ.వి.పేట సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, పాలవలస గ్రామ నాయకుడు జల్లు అప్పలస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ యాత్రకు వెళ్లేందుకు ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న జ్ఞాహ్నవి

సారవకోట: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అమెరికా యాత్రకు పంపించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. దీంట్లో భాగంగా సారవకోట కేజీబీవీ నుంచి ఈ ప్రవేశ పరీక్షకు ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ ముగ్గురిలో ఇద్దరు అందుబాటులో లేకపోవడంతో 10వ తరగతిలో 582 మార్కులు సాధించిన యు.జ్ఞాహ్నవితో స్థానిక ఎమార్సీలో అధికారులు ఈ ప్రవేశ పరీక్ష రాయించారు. ఈ పరీక్షను జీసీడీఓ ఎస్.నీరజ పర్యవేక్షించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన 52 మందిని ఎంపిక చేశారని, దాంట్లో జిల్లా నుంచి 10 మంది ఎంపికయ్యారన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి అమెరికా యాత్రకు పంపించనున్నట్లు తెలిపారు. ఏపీఓ నలినీకుమార్, ఎంఈఓ భూలక్ష్మి ఉన్నారు.

ఉద్దానం ప్రాజెక్టుపై విమర్శలు తగవు



హిరమండలం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం/కొత్తూరు: ఉద్దానం సమగ్ర మంచి నీటి పథకం ప్రాజెక్టుపై టీడీపీ నాయకుల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ హిరమండలం మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌లు అన్నారు. హిరమండలం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అలాగే కొత్తూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ నాస బాలకృష్ణ, ఎంపీటీసీ వనుము లక్ష్మీనారాయణ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉద్దానం ప్రాంతం కిడ్నీ భూతంతో అతలాకుతలం అవుతుంటే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి సమగ్ర మంచినీటి ప్రాజెక్టుకు సుమారు రూ.700 కోట్లు కేటాయించారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాలో ఇటువంటి ప్రాజెక్టు ఎక్కడైనా పూర్తిచేశారా అని ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని మాజీ సీఎం చంద్రబాబు వంశధార ప్రాజెక్ట సందర్శనకు వస్తారని ప్రశ్నించారు. ఇప్పుడు విషం చల్లడం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు తగునా అని నిలదీశారు. సీఎం జగన్‌తో మాట్లాడి పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు తాగునీటిని అందించేందుకు రెండో ఫేజ్‌లో రూ.260 కోట్లు నిధుల మంజూరుకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇటువంటి విమర్శలకు దిగుతున్నారన్నారు. హిరమండలం మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు విష్ణు ప్రసాద్ పండా, ఉప సర్పంచ్ వి.బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎందవ ప్రసాద్, మీసాల శంకర్, నక్క ఆనందరావు, రామకృష్ణ, కొత్తూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, పంకజ్‌దాస్, జి.రామారావు, గార రాజులు నాయుడు, ప్రాత్రకొండ నాయుడు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సర్వే చేపట్టాలని తహసీల్దార్ ఆర్ అప్పలరాజు అన్నారు. బీఎల్‌ఓలతో తన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా తీసుకుని ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని రాజకీయ నాయకుల సమక్షంలో ఇంటింటికీ వెళ్లి జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు సరిచేసుకోవాలన్నారు. మరణించిన, వివాహం జరిగి అత్తవారింటికి వెళ్లిన మహిళల ఓట్లు ఆయా కుటుంబ సభ్యుల అనుమతితో తొలగించాలన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు వయసు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఒక కుటుంబానికి చెందిన వారి ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చేయాలన్నారు. విచారణ పూర్తయిన తరువాత ఓటర్ల జాబితాల్లో తప్పులు ఉంటే బాధ్యులైన బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్తంగా..

భూముల రీసర్వే ప్రక్రియ పూర్తిచేయాలి

హిరమండలం: పాడలి, దుగ్గుపురం రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ మురళీమోహన్‌కు సోమవారం పలువురు రైతులు వినతిపత్రం అందించారు. నిర్వాసితుల గ్రామాల్లోని మిగుల భూములుగా 600 ఎకరాలు ఉండిపోయాయన్నారు. మండలంలో అన్ని గ్రామాలోని రీ సర్వే ప్రక్రియ పూర్తయినా.. మా గ్రామాల్లో సర్వే ప్రక్రియ జరగలేదన్నారు.

చట్టాలపై అవగాహన

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలసలో గల ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని స్థానిక సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న భోజన సదుపాయల కోసం ఆరా తీశారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

గ్రామ వలంటీర్ల నియామకం

కొత్తూరు: మండలంలో ముగ్గురు గ్రామ వలంటీర్లను నియమించినట్లు స్థానిక ఎంపీడీఓ ఎం.పావని సోమవారం తెలిపారు. బలద, కుంటిభద్ర, కర్లెమ్మ గ్రామ సచివాలయాల పరిధిలోని మూడు ఖాళీలను భర్తీ చేశామన్నారు. నియామక ఉత్తర్వులను కార్యదర్శుల ద్వారా అందజేశామన్నారు.

రెండు ఇసుక లారీల సీజ్

కొత్తూరు: మండలంలోని బడిగాం రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఎస్‌ఐ ఎం.గోవిందరావు తన సిబ్బందితో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తుండగా రెండు లారీలను పట్టుకున్నారు. లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

తీమరలో రహదారి నిర్మాణం

పాతపట్నం: మండలంలోని తీమర గ్రామంలోని దేవాలయం దగ్గర రహదారి నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి ధనుంజయ సోమవారం తెలిపారు. రహదారి గ్రామ ప్రజలు, ఆలయానికి వచ్చేవారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పలి వినోద్, సచివాలయ ఇంజినీరు పాల్గొన్నారు.


ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ప్రసాదరావు

సరుబుజ్జిలి: అనాథ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా క్రైస్తవ మ్యారేజ్ రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని శ్రీరాంవలస, వెన్నెలవలస గ్రామాల్లో 150 మందికి సోమవారం సిక్కోలు సేవా సమితి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పలువురు క్రైస్తవ ఆరాధకులు, సిక్కోలు సేవా సమితి అధ్యక్షురాలు కల్పన పాల్గొన్నారు.


మణిపూర్ ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

సారవకోట: మణిపూర్ ఘటనకు నిరసనగా మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి ఘటనను తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సువ్వారి గాంధీ పుట్టినరోజు



ఆమదాలవలస: రాలీలో పాల్గొన్న సువ్వారిగాంధీ

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ పుట్టినరోజు వేడుక సోమవారం ఆమదాలవలసలో ఘనంగా నిర్వహించారు. పొందూరు నుంచి అభిమానులతో కలిసి బైక్ ర్యాలీతో ఆమదాలవలస పట్టణంలోని వైఎస్సార్ కూడలికి చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేశారు.

ఆమదాలవలసలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో పార్టీ కేడర్‌తో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: మండలంలోని వీఆర్‌గూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కోటిపల్లి కూడలికి మండలంలోని ఆయన అనుచరులు చేరుకున్నారు. బైక్ ర్యాలీని ఆమదాలవలస మండలంలోని కొర్లకోట వరకు కొనసాగించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



గుప్పెడుపేటలో మత్స్యకారుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: గుప్పెడుపేట, పోలాకి గ్రామాల్లో వేర్వేరు ఘటనల్లో ప్రమదవశాత్తు మృతిచెందిన మత్స్యకారుడు సిరిగిడి కామయ్య, రైతు ముప్పిడి శాంతారావు కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. ఆయా కుటుంబాలను ఓదార్చిన ప్రభుత్వం తరపున అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెంటికోట త్రినాథరావు, తూలుగు అశోక్‌కుమార్, లండ యర్రయ్య, నందుల్లి పైడితాత, తులే పైడమ్మ తదితరులున్నారు.

కాలిబాటలతో అధిక ప్రయోజనాలు



వ్యవసాయ అధికారి సురేష్ కుమార్

జలుమూరు: వరి వెదలతోపాటు ప్రస్తుతం వేస్తున్న ఊభాలలో కాలిబాటలు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాలి బాటలు తూర్పు, పడమర దిశలలో తీయాలన్నారు. ఒక్కో కాలిబాట 20 సెంటి మీటర్ల వ్యత్యాసంతో తీసుకుంటే గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగిలి పైరు ఏపుగా పెరిగి దిగుబడికి దోహద పడుతుందన్నారు. వీటితోపాటు ఎరువుల వినియోగం, కలుపు నివారణ, దోమ వ్యాప్తి చెందకుండా పైరును కాపాడుతుందన్నారు. రైతులు గమనించి కాలిబాటలు తీసుకోవాలన్నారు. ఊభాలు జరిగిన రెండు, మూడు రోజులు తరువాత కూడా కాలి బాటలు తీయవచ్చన్నారు.

నేడు నరసన్నపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంతోపాటు పరిసర వీధుల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

నేడు ఇంటింటికీ కుళాయిలకు శంకుస్థాపన

ఆమదాలవలస రూరల్: మండలంలో మునగవలస, దన్నానపేట, సంతకొత్తవలస గ్రామాల్లో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం పర్యటించనున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన చేయనున్నారని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.